
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 11 డిసెంబరు 2024



గ్రావెల్ దందా నిజమే..!

■ కలెక్టర్‌కు అధికారుల నివేదిక



గ్రావెల్ దందాపై విచారిస్తున్న అధికారులు (ఫైల్)

కూలడానికి ఆస్కారం ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్న 220 కేవీ విద్యుత్ టవర్



యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి గ్రావెల్ దందా వాస్తవమేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు నివేదికను పంపారు. వైసీపీ నాయకుడు బొంబాయి రమేష్‌నాయుడు ప్రభుత్వ, మాన్యం భూముల్లో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుకున్నారని టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, లక్ష్మీ నారాయణ, ఆదినారాయణ నవంబరు 11న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని యాడికి తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి. నవంబరు 27, 28, 29 తేదీల్లో రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ, విజిలెన్స్, ట్రాన్స్‌కో, గ్రామ పంచాయతీ, ఎండోమెంట్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారించారు. తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు పంపారు.

ఇదీ.. నివేదిక సారాంశం

కలెక్టర్ సర్..

వైసీపీ నాయకుడు, ఆయన బావమరిది ఆధ్వర్యంలో సర్వే నంబరు 753-1, చిన్నపేట ఆంజనేయస్వామిమాన్యం, సర్వే నంబరు 546 భైరవగుట్ట, సర్వే నంబరు 343 బూడిదతిప్ప, సర్వే నంబరు 1448, 1515 తిరునాంపల్లి వంక ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలించారు. యాడికి చుట్టుపక్కల వేసిన అనుమతి లేని లే అవుట్లకు తరలించారు. అక్కడి అంతర్గత రోడ్లకు గ్రావెల్‌ను వినియోగించారు. గుత్తి నుంచి తాడిపత్రి వెళ్లే 220 కేవీ విద్యుత్ టవర్ బేస్‌మెంట్ లెవల్ నుంచి 14 అడుగుల లోతు వరకు తవ్వి గ్రావెల్‌ను తరలించారు. దీనివల్ల విద్యుత్ టవర్ కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే మరో మూడు నాలుగు విద్యుత్ టవర్లు కూలిపోయే ప్రమాదం ఉంది. పర్యవసానంగా యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, యల్లనూరు, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఒక్కొక్క విద్యుత్ టవర్ ఏర్పాటుకు రూ.2కోట్ల మేర ఖర్చు అవుతుంది. మరమ్మతులకు 15 నుంచి 20రోజుల సమయం పడుతుంది. కాబట్టి అక్రమాలకు పాల్పడినవారిపై నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకునేందుకు ఆదేశాల నిమిత్తం నివేదికను పంపుతున్నాము.

-ప్రతాపరెడ్డి, తహసీల్దారు, యాడికి

చర్యలపై ఉత్కంఠ

గ్రావెల్ దందా చేసిన వైసీపీ నాయకుడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని యాడికి మండలంలో ఉత్కంఠ నెలకొంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అనుమతిలేని లే అవుట్‌లు వేసినవారిలో ఆందోళన మొదలైంది. అనుమతిలేని లే అవుట్లు, గ్రావెల్ దందాపై ఎలాంటి చర్యలు ఉంటాయోనని ఆరా తీస్తున్నారు. యాడికి చుట్టుపక్కల అనుమతి లేని లే అవుట్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒక్క లే అవుట్‌కు మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. లేఅవుట్లకు అనుమతి లేకపోవడం ఒక ఎత్తైతే.. వాటికి గ్రావెల్‌ను అక్రమంగా తరలించడం మరో ఎత్తు. పర్యవసానాలు ఎలా ఉంటాయో వేచిచూడాల్సిందే.



ఎంతెంత దూరం..?

• నరవాహన

'ఇదేదో బరువులు మోసే పోటీలా ఉందే..' అనుకుంటున్నారా..? అదేమీ కాదు..! అనంతపురం నగరంలోని జిల్లా సర్వజన వైద్యశాలలో రోగులను వారి బంధువులు ఇలా మోసుకుపోతున్నారు. వీల్ చైర్‌లు, స్ట్రెచర్‌లు తగినన్ని లేకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ఈ పరిస్థితి కొన్నేళ్ల నుంచి కొనసాగుతోంది. అత్యవసర విభాగం, ఓపీ.. ఇలా ఎక్కడ చూసిన మోసేవారు ఉంటేనే వైద్యం అందుతుంది. లేదంటే పడిగాపులు కాయాల్సిందే. స్కానింగ్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు.. ఇలా ఎక్కడికైనా నర వాహనమే ఆధారం. ప్రమాదంలో గాయపడ్డవారు, వ్యాధులబారిన పడి నీరసించినవారు నడవలేకపోతే.. వీల్‌చైర్ లేదా స్ట్రెచర్ మీద తరలించాలి. కానీ ఆ ఏర్పాట్లు పెద్దాసుపత్రిలో పెద్దగా లేవు. దశాబ్దాలుగా సమస్య కొనసాగుతున్నా.. పరిష్కారం గురించి ఎవరూ ఆలోచించడం లేదు.

- ఆంధ్రజ్యోతి,
అనంతపురం టౌన్



చాలా చాలా దూరం



నిధులే మింగేశాయా..?

అవినీతి ఒత్తిళ్లతోనే రాఘవేంద్ర ఆత్మహత్య

వైసీపీ హయాంలో రూ.50 లక్షలు పక్కదారి..?

పనులు చేయకనే బిల్లులు చేసుకున్నారా..?

నకిలీ బిల్లులు వాడినట్లు పోలీసుల నిర్ధారణ..?

కళ్యాణదుర్గం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర ఆత్మహత్యకు వైసీపీ హయాంలో జరిగిన అవినీతి ఒత్తిళ్లే కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పంచాయతీ నిధుల వినియోగం గురించి ఆరా తీస్తున్నారు. ఇద్దరు వైసీపీ నాయకుల ఒత్తిడి కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని రాఘవేంద్ర తండ్రి నాగభూషణం ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రాఘవేంద్రబాబు జూన్ 2023న కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో విధుల్లోకి చేరారు. ఆరు నెలల క్రితం కంబదూరు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆత్మహత్య చేసుకునే సమయానికి ఆయన కంబదూరు, మర్రిమాకులపల్లితోపాటు రాళ్ల అనంతపురం పంచాయతీలకు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో మూడు పంచాయతీలలో నిధుల డ్రా, వినియోగం గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

రూ.50 లక్షలు డ్రా..?

మూడు పంచాయతీలలో సుమారు రూ.50 లక్షల వరకు నిధులను రాఘవేంద్ర డ్రా చేసినట్లు తెలిసింది. ఇవన్నీ పంచాయతీ నిధులే కావడంతో ఎవరెవ్వరికి ఇచ్చారు, పనులు చేయకనే డ్రా చేశారా? వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మూడు పంచాయతీల్లో జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా దుర్వినియోగం అయినట్లు తెలిసింది. దీంతో మండల పరిషత్ కార్యాలయం, బ్యాంకుల్లో స్టేట్‌మెంట్ రికార్డులను పోలీసులు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.20 లక్షల వరకు నిధుల డ్రా చేసినట్లు రికార్డుల ఆధారంగా గుర్తించారు. మిగిలిన నిధులను ఎక్కడెక్కడ, ఎంత ఖర్చు చేశారో తేల్చే పనిలో నిమగ్నయ్యారు.

చనిపోయే ముందు..

ఆత్మహత్యకు నాలుగురోజుల ముందు రాఘవేంద్ర రూ.4 లక్షలు డ్రా చేసినట్లు తెలిసింది. కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఓ అధికారితో సంతకం చేయించుకుని, ఆ నిధులను డ్రా చేసినట్లు తెలిసింది. దీంతో ఆ అధికారి ఆందోళనకు గురవుతున్నారు. ఆ రూ.4 లక్షలు ఏ నిధుల నుంచి డ్రా చేశారో, ఎవరికి ఇచ్చారో తెలియడం లేదు.



ఆపరేటర్ వద్ద ఆధారాలు

వైసీపీ హయాంలో పనిచేసిన ఓ కంప్యూటర్ ఆపరేటర్ చేత రాఘవేంద్ర బిల్లులను అప్‌లోడ్ చేయించేవారు. దీంతో ఆ కంప్యూటర్ ఆపరేటర్‌ను కూడా పోలీసులు పిలిపించారు. ఎక్కడెక్కడ నిధులను డ్రా చేశారు, ఎంతమేరకు బిల్లులు అప్‌లోడ్ చేశారని ప్రశ్నించి, వివరాలు రాబట్టారు. కంప్యూటర్ ఆపరేటర్ ఇచ్చిన ఆధారాలతోనే బ్యాంకులో ఓ రూ.20 లక్షలకు సంబంధించి విత్‌డ్రా స్టేట్‌మెంట్ లభ్యమైనట్లు తెలిసింది. పంచాయతీలలో నిధుల డ్రా వెనుక నలుగురు అధికారుల హస్తం ఉందని తెలిసింది. వారి మెడకు ఉచ్చు బిగుస్తోంది. దీంతో ఆ నలుగురు ఆందోళనకు గురవుతున్నారు.



క్యాష్ బుక్ ఎక్కడ?

రాఘవేంద్రబాబు నిధుల డ్రా కోసం ఉపయోగించిన క్యాష్ బుక్ మాయమైనట్లు తెలిసింది. క్యాష్ బుక్ ఎవరివద్ద ఉందో తెలియడం లేదు. జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధుల డ్రా వివరాలను క్యాష్ బుక్‌లోనే నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆ పుస్తకం మాయం కావడం అనుమానాలకు తావిస్తోంది. నకిలీ బిల్లులు సృష్టించి జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసినట్లు తెలిసింది. ఆ బిల్లులన్నీ నకిలీవే అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నకిలీ బిల్లులను చూపించి నిధులను పక్కదారి పట్టించారని స్పష్టంగా తెలుస్తోంది. నకిలీ బిల్లులు ఎక్కడివో, వాటి వెనుక ఎవరెవరు ఉన్నారో పోలీసులు నిగ్గుతేల్చేపనిలో ఉన్నారు.

ఇక్కడ ఉండలేం..

కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే అధికారులకు విధి నిర్వహణ కత్తిమీద సాములాగా తయారైయింది. రాఘవేంద్ర ఆత్మహత్య తరువాత పోలీసులు సవాలక్ష ప్రశ్నలు వేస్తున్నారు. ఆధారాలు అడుగుతున్నారు. దీంతో తమకు ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు అధికారలు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయంలో ఉండలేమని బహిరంగంగా చెబుతున్నారు. దీన్నిబట్టి.. వైసీపీ హయాంలో అవినీతి ఏ స్థాయిలో ఊహించుకోవచ్చు.

అమరావతికి కలెక్టర్

నేడు.. రేపు సీఎం సమీక్ష




అనంతపురం టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ రాష్ట్ర రాజధాని అమరావతికి మంగళవారం బయలుదేరారు. సీఎం చంద్రబాబు బుధ, గురువారాలలో నిర్వహించే సమీక్షలో ఆయన పాల్గొంటారు. జిల్లాలు, ప్రాతాల వారీగా అబివృద్ధి, సంక్షేమం గురించి సీఎం ప్రత్యేక విజన్ డాక్యుమెంటరీని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితుల గురించి వివిధ శాఖల నుంచి పక్కా సమాచారం సేకరించి తీసుకువెళ్లారు. నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తారు.

ఫీల్డ్‌లోకి తమ్ముళ్లు..?
ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో టీడీపీ నాయకుల దందా
6

ఇక గతమే
రైల్వే మెయిల్ సర్వీస్ తరలింపునకు యత్నం

దేవుడి భూమి సైతం..
మాన్యం అన్యాక్రాంతం
సక్రమంగా కౌలు చెల్లించని వైనం
పర్యవేక్షణ లేకపోవడం వల్లే..?
7



వసూళ్లు విభిన్నం..!

చేయి తడిపితేనే పరికరాలు, వాహనాలు

నాణ్యమైన బియ్యం కనిపిస్తే కాజేయడమే..!

విభిన్న ప్రతిభావంతుల శాఖలో ఓ అధికారి తీరిది

ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోని జిల్లా అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖలో ఓ అధికారి కమీషన్‌ల వేట సాగిస్తున్నాడు. ఏది కావాలన్నా చేతులు తడపాల్సిందే అంటున్నాడు. లేదంటే ఫైళ్లను పక్కన పడేస్తున్నాడు. దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న మోటార్ సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి లోపం ఉన్నవారికి అందించే పరికరాల విషయంతో చేతివాటం ప్రదర్శించాడని ఆరోపణలు వస్తున్నాయి. వసతి గృహాలకు చేరాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించారని ప్రచారం జరుగుతోంది. ఆ అధికారిపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దివ్యాంగులు, సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

దేన్నీ వదలరా..?

● సార్వత్రిక ఎన్నికల సమయంలో దివ్యాంగులు ఓటు వేసేందుకు వీల్ చైర్లు అవసరమని అధికారులు గుర్తించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 576 వీల్‌చైర్లు అవసరమని నివేదికలు తయారు చేశారు. ఓ కమిటీ ఆధ్వర్యంలో టెండర్లు పిలవగా.. ముగ్గురు వ్యక్తులు దక్కించుకున్నారు. వారితో ఆ అధికారి కమీషన్ ఒప్పందం చేసుకున్నారని, మొత్తం బడ్జెట్ రూ.28.80 లక్షలు కాగా, రూ.6 లక్షలకు పైగా కమీషన్ తీసుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

● కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరులో ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని బాధితులు వాపోతున్నారు. యూనిట్ల ప్రకారం అర్హులకు రుణాలు అందించకుండా, కాసులు ముట్టజెప్పిన వారికి ఇచ్చారని బాధితులు వాపోతున్నారు. ఒక్కో రుణానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ కమీషన్ తీసుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రశ్నిస్తే.. పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా.. రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారుల అండతో బయటపడుతున్నారని అంటున్నారు.



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయం

● వార్డెన్‌ల డైట్ బిల్లుల విషయంలో ఆ అధికారికి మామూళ్లు చెల్లించాల్సిందే అంటున్నారు. లేదంటే ఫైళ్లు ముందుకు కదలదని అంటున్నారు. కార్యాలయ నిర్వహణకు, క్యాంపు ఖర్చులకు వార్డెన్ల నుంచే డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కార్యాలయ సిబ్బందిలో కొందరితో రూ.లక్షలు ఖర్చు పెట్టించి, ఆ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చర్చ జరుగుతోంది.

● వసతి గృహాలలో దివ్యాంగులు, అంధులకు సరఫరా అయ్యే బియ్యాన్ని ఆ అధికారి పక్కదారి పట్టిస్తున్నారు. తనిఖీల పేరిట వెళ్లి.. నాణ్యమైన బియ్యం కనిపిస్తే ఇంటికి తరలిస్తారని ప్రచారం జరుగుతోంది. విద్యార్థులకు తక్కువ వస్తాయని చెప్పినా.. వినిపించుకోవడం లేదని అంటున్నారు.

చేతులు తడపాల్సిందే..

విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీలోనూ ఆ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చంక కర్రలు కావాలంటే రూ.200, వినికిడి యంత్రాలకు రూ.700, వీల్ చైర్‌లకు రూ.2 వేలు, ట్రై సైకిళ్లకు రూ.1000 వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అదే బైక్ ఇస్తే రూ.20 వేలకు పైగా తీసుకుంటున్నారని సమాచారం. విషయం తెలుసుకున్న ఓ ప్రజాప్రతినిధి పంపిణీ కార్యక్రమంలోనే ఆ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ల్యాప్‌టాప్‌లు ఇవ్వకుండా రోజుల తరబడి విద్యార్థులను తిప్పుకున్నారని సమాచారం. ఒక్కో ల్యాప్‌టాప్‌కు రూ.10 వేల దాకా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

వేదవతిపై శాశ్వత వంతెన

■ పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం



హగరిలో రహదారి వంతెన ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ

కణేకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య వేదవతి హగరి నదిపై శాశ్వత వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం తెలిపారు. దిగువగేరి నుంచి వెళ్లే దారిలో నది రహదారిని పరిశీలించారు. వంతెన నిర్మాణానికి గతంలో రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రస్తుతం ధరలు పెరిగినందున మరోసారి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. దాదాపు 300 మీటర్ల మేర ఏర్పాటు చేయబోయే ఈ వంతెన 7.5 మీటర్ల వెడల్పు, 4 మీటర్ల లోతుతో పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ రహదారిపై టీడీపీ నాయకులు పలుసార్లు సొంత డబ్బులతో రహదారిని నిర్మించారు. వర్షం వచ్చిన ప్రతిసారీ కొట్టుకుపోతోంది. దీంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శాశ్వత వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తున్నారని ఎస్ఈ తెలిపారు. కళేకుర్తి వద్ద గ్రామ ప్రధాన రహదారి నుంచి సచివాలయం వరకు రూ.1.08 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు ప్రాంతాన్ని ఎస్ఈ పరిశీలించారు. పీఆర్ డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ రామాంజినేయులు, టీడీపీ నాయకులు కళేకుర్తి సుదర్శన్, చిన్న ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఏపీడీగా వనజా అక్కమ్మ



వనజా అక్కమ్మ

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఏపీడీగా వనజా అక్కమ్మ నియమితులయ్యారు. ఇటీవల ఐసీడీఎస్ పరిధిలోని అసిస్టెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టులను అడ్‌హక్ ప్రమోషన్లతో భర్తీ చేశారు. ఈ క్రమంలో కంబదూరు సీడీపీఓగా పనిచేస్తున్న వనజా అక్కమ్మకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)గా ఇటీవల ప్రమోషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏపీడీలు పీడీగా వ్యవహరించనున్నారు. ఈక్రమంలో ఏపీడీగా ఉద్యోగోన్నతి పొందిన వనజా అక్కమ్మ బుధవారం అనంతపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ పీడీగా శ్రీదేవి వ్యవహరించారు. ఆమె నుంచి కొత్త ఏపీడీ వనజా అక్కమ్మ బాధ్యతలు స్వీకరించనున్నారు.

కిక్కులో తిక్క పని



పాముతో ఆట్లాడుతున్న మందుబాబు

నాగుపాముతో మందుబాబు ఆటలు..!

అనంతపురం నగర శివారుల్లోని టీవీ టవర్ సమీపంలో ఓ మందుబాబు నాగుపాముతో ఆటలాడుతూ హల్‌చల్ చేశాడు. కదిరి-అనంతపురం హైవే పక్కన కూర్చొని పామును చేతిలో పట్టుకోవడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. పాము పడగ విప్పగా చేత్తో అటూ ఇటూ ఆడిస్తూ పట్టుకున్నాడు. మెడలో వేసుకుని అటూ ఇటూ తిరిగాడు. దగ్గరకు వస్తే పాము విసిరేస్తానంటూ స్థానికులను భయపెట్టాడు. అయినా ఆ పాము ఇతడిని కాటు వేయకపోవడం గమనార్హం. ఇంతలో కొంత మంది మందుబాబును మందలించి పామును సమీపంలోని చెట్లపొదల్లోకి విడిచి పెట్టేలా చేయించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

మధ్యాహ్న భోజనం సూపర్

రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం మంచి నాణ్యతతో ఉందని రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. ఆయన మంగళవారం తాడిపత్రి, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. స్థానిక త్రిబుల్‌ఎస్ ఎంఆర్‌ఎంలో మధ్యాహ్న భోజనంలోని అన్నం, పప్పు, రసం, చిత్రాన్నం, పులిహోర, పెరుగన్నం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. అనంతరం నాణ్యత తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంత నాణ్యమైన భోజనాన్ని మెను ప్రకారం ఇవ్వడం చాలా గ్రేట్ అని కితాబిచ్చారు. మధ్యాహ్నభోజనాన్ని ఎవరు చేయిస్తున్నారని ఆరాతీయగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శైలజాసేవాట్రస్ట్ నిర్వాహకుడు అరవింద నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇంత నాణ్యమైన భోజనం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. అనంతరం అరవింద నారాయణరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ముందు ముందు కూడా ఇలాగే చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. అంతకుముందు జయనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న జూటూరుకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, చుక్కలూరు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు చుక్కలూరు హైస్కూల్‌ను తనిఖీచేసి భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ నాగరాజు, సివిల్‌సప్లై అధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



చిత్రాన్నం తింటున్న ఫుడ్ కమిటీ ఛైర్మన్

ఇక గతమే...!

రైల్వే మెయిల్ సర్వీస్ తరలింపునకు యత్నం

ఆమరణ దీక్షకు సిద్ధం



బ్రిటిష్ పాలనా కాలం నుంచి గుంతకల్లులో ఆర్ఎంఎస్ సేవలందిస్తోంది. అలాంటి ఆర్ఎంఎస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం. పార్శిల్, స్పీడ్, రిజిస్టర్ వేరు వేరు కంపెనీలా తయారు చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తోంది. ఆర్ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగించాలి లేదంటే ఆమరణ దీక్ష చేస్తాం.

-నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు

డివిజనల్ ఆర్ఎంఎస్ ప్రధాన కార్యాలయం



గుంతకల్లుటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో అతి పెద్ద రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్ఎంఎస్)కార్యాలయాన్ని గుంతకల్లు నుంచి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. రైళ్ల ద్వారా పార్శిళ్లు, ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేయడానికి గుంతకల్లులో 1960లో రైల్వే మెయిల్‌సర్వీసు కార్యాలయం ఏర్పాటు చేశారు. అరవై ఏళ్లపైబడిన చరిత్ర ఉన్న గుంతకల్లు రైల్వే మెయిల్ సర్వీస్‌ను అనంతపురం, కర్నూలుకు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గుంతకల్లు నుంచి స్పీడ్, రిజిస్టర్, అన్‌రిజిస్టర్, బిజినెస్, వార పత్రికలు, మ్యాగ్జైన్‌లను ముంబై, బెంగళూరు, చెన్నై రాష్ట్రాలకు పంపేవారు. కేవలం స్పీడ్ పోస్టు సాకుగా చూపి ఇక్కడ ఉన్న సర్వీస్ కార్యాలయాన్ని తరలించేందుకు యత్నిస్తున్నారు. గతంలో రోజు వందమంది సిబ్బంది పనిచేసేవారు. పని ఎక్కువగా ఉన్న, స్థలంలో లేకున్న రైల్వే ప్లాట్‌ఫాంలోనే ఉత్తరాలు పెట్టుకుని పనిచేసేవారు. మోదీనబాదులో 8 ఎకరాల స్థలంలో రైల్వే మెయిల్ సర్వీసు కార్యాలయం, క్వార్టర్స్‌లు ఉన్నాయి. మరిన్ని భవనాలు నిర్మించుకునేందుకు ఖాళీ స్థలం ఉంది. వంద మంది రెగ్యులర్, వంద మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్యాలయం ఇతరప్రాంతాలకు తరలిస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇక్కడే స్పీడ్ పోస్టు సౌకర్యం కల్పిస్తే సర్వీస్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

గుంతకల్లు నుంచి అనంతపురం, కర్నూలుకు..

ఇక్కడే కొనసాగించాలని ఉద్యోగులు అభ్యర్థన



గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలో ఆర్ఎంఎస్ కార్యాలయం

పోస్టల్ స్టోర్ డిపో మూసివేత

పట్టణంలోని పాత ఐటీసీ డిపో వద్ద ఉన్న పోస్టల్ స్టోర్ డిపో ద్వారా రాయలసీమ పరిధిలో అన్ని పోస్టాఫీసులకు స్టేషనరీ సప్లై చేసేవారు. జూన్ 1, 2021లో స్టోర్ డిపోను మూసివేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి స్టేషనరీ సరఫరా చేస్తున్నారు. అలాగే పదేళ్ల కిందట సూపరింటెండెంట్ కార్యాలయం మూసివేశారు. ప్రస్తుతం స్పీడ్ పోస్టులో విలీనం చేసి రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయాన్ని మూసివేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆర్ఎంఎస్‌ను అభివృద్ధి చేస్తాం

ఆర్ఎంఎస్ బలాన్ని గుర్తించకుండా, బలహీనతను గుర్తించి ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదు. గుంతకల్లులో ఎంతో చరిత్ర కలిగిన ఆర్ఎంఎస్‌కు చరమగీతం పాడడానికి పూనుకోవడం దారుణం. ఇతరప్రాంతాలకు తరలిస్తే మా కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆర్ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగిస్తే మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం.



- ప్రవల్లిక, ఆర్ఎంఎస్ ఉద్యోగి

నాకేం తెలియదు

- అగ్రిగోల్డ్ భూముల విషయంపై తహసీల్దార్
- ఆస్తులను 'దున్నేస్తున్న' వైసీపీ నాయకుడు
- కార్యాలయంలో ఓ అధికారితో డీల్

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్యనున్న అగ్రిగోల్డ్ భూముల విషయం గురించి తనకు ఏమి తెలియదని తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం ఫోన్‌లో వివరణ ఇచ్చారు. అగ్రిగోల్డ్ విషయమా? నాకు ఏమి తెలియదు. ఆఫీసులో ఎవరు చూసుకుంటున్నారో కూడా తెలియదని సమాధానం ఇచ్చారు. ఆ గ్రామంలో వందల ఎకరాల్లో భూములు ఉన్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఆ భూములను సీజ్ చేసినట్లు కూడా తనకు తెలియదని ఆయన పలువురు వీఆర్వోల వద్ద ఆవేదన వెల్లగక్కినట్లు తెలిసింది. మండలానికి కొత్తగా వచ్చానని అలాంటి విషయాలు నాకు ఎలా తెలుస్తాయంటూ చెప్పారు. మండలంలో కడవకల్లు గ్రామంలో ఓ వైసీపీ నాయకుడు వంద ఎకరాలకు పైగా ఆక్రమించుకుని సాగు చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న విషయం తెలిసిందే. ఇదంతా తెలిసిన అధికారులు ఇప్పటివరకు ఏమీ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



రూ.20లక్షల పరికరాలు మాయం

అగ్రిగోల్డ్ భూముల్లో ఉపయోగించిన యంత్రాలు, పరికరాలు తదితర సామగ్రి విలువ రూ.20లక్షలకు పైనే ఉంటుందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. రెండు ట్రాక్టర్లు, వందలాది మీటర్ల డ్రిప్పు వైర్లు, వేలాది మీటర్ల కంచె తదితర సామగ్రిని సైతం ఆ వైసీపీ నాయకుడే సుమారు రూ.20లక్షలకు పైగానే అమ్ముకున్నట్లు సమాచారం. వీటితో పాటు వంద ఎకరాల్లోపు అరటి, మొక్కజొన్న, దానిమ్మ తదితర పంటలు సాగుచేసుకుంటూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అగ్రిగోల్డ్‌లో ఉన్న లక్షలాది రూపాయల భవంతులను సైతం ఆ వైసీపీ నాయకుడు లీజుకు ఇచ్చుకుంటూ లబ్ధి పొందుతున్నాడు. ఇదంతా తెలిసిన రెవెన్యూ అధికారులు మాకెందుకులే ఆ నాయకుడి గురించి అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



అగ్రిగోల్డ్ భూమి ప్రధాన ముఖద్వారం

అధికారులకు వాటా ముట్టిందా?

అగ్రిగోల్డ్ భూముల విషయంలో ఆ వైసీపీ నాయకుడు అధికారులకు వాటా ముట్టచెప్పాడన్న ఆరోపణలు కడవకల్లు గ్రామంలో వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కనీసం ఆ ప్రాంతాన్ని ఏ ఒక్క అధికారి తనిఖీచేసిన పాపాన పోలేదు. ఆ వైసీపీ నాయకుడు నేరుగా పుట్లూరులోని తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారి దగ్గరకు వెళ్లి నేరుగా డీల్ చేశాడన్న విమర్శలు ఉన్నాయి. తనకు టీడీపీ నాయకుల అండ ఉంది ఎవరు ఏమిచేయలేరు అంటూ పలువురు వీఆర్వోల దగ్గర చెబుతున్నట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారికి పెద్దమొత్తంలో ఆమ్యామ్యాలు ముట్టచెప్పినట్లు సమాచారం.

సంక్రాంతికి పనులు పూర్తి కావాలి

ప్రతి హాస్టల్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టరు ఆదేశం



అనంతపురం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల నిర్మాణాలు, మరమ్మతు పనులు సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వసతిగ్రహాల ప్రగతి పనులపై మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 11 హాస్టళ్లకు డిస్ట్రిక్ జనరల్ ఫండ్ కింద రూ1.12కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటికే 10హాస్టళ్లలో పనులు పూర్తి చేశారని మిగిలిన ఒక్కహాస్టల్లోనూ పనులు త్వరగా ముగించాలన్నారు. మరోవైపు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.5.70కోట్లతో 36 హాస్టళ్లకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉందని వెల్లడించారు. ఈపనులన్నీ ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. ప్రతి వసతిగృహంలోను తప్పనిసరిగా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీఈడబ్ల్యుఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఈపనులన్నీ పూర్తి చేయించాలన్నారు. అన్ని వసతిగ్రహాలలో రెండురోజుల్లోగా ట్యూటర్లను నియమించుకోవాలన్నారు. సంక్రాంతి పండుగలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభోత్సవాలు చేపట్టాలని కలెక్టరు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈపనుల విషయంలో ఎవరు ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ డీడీ ప్రతాప్ ఎసూర్యనారాయణరెడ్డి, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నానాటికీ తీసికట్టు..!

- కూలుతున్న హెచ్చెల్సీ వంతెనలు
- ఆధునికీకరణ పట్టని ప్రభుత్వాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు



కణేకల్లు వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

కణేకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో హెచ్చెల్సీ పరిస్థితి నానాటికి దిగజారుతోంది. కాలువకు అనుబంధంగా ఉన్న అనేక వంతెనలు, కల్వర్టులు కుప్పకూలుతున్నాయి. దీంతో రానున్న కాలంలో హెచ్చెల్సీ పరిస్థితిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూలిన ఐదు వంతెనలు

గత రెండేళ్ల నుంచి హెచ్చెల్సీపై ఐదు కల్వర్టులు కుప్పకూలాయి. అందులో 165 కి.మీ. వద్ద ఉన్న బిదురకుంతం కల్వర్టు, 171 కి.మీ. వద్ద ఉన్న హోన్నూరు కల్వర్టు, 113 కి.మీ. వద్ద ఉన్న నాగలాపురం వంతెనతో పాటు 147 కి.మీ. వద్ద ఉన్న కణేకల్లులో శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద ఉన్న వంతెన, 155 కి.మీ. వద్ద ఉన్న నాగేపల్లి వంతెన ఉన్నాయి. ఇవి కూలిపోవడంతో ఆయా గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నాగేపల్లి వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

కూలేందుకు సిద్ధం

మాల్యం వద్ద ఉన్న ప్రధాన హెచ్చెల్సీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందోనన్న పరిస్థితి ఏర్పడింది. అనేక ఏళ్లుగా ఈ బ్రిడ్జి గురించి పాలకులకు, అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా నిధులు లేవన్న కారణంతో మరమ్మతులు చేయలేదు. హెచ్చెల్సీ అక్విడెక్ట్ పరిస్థితి కూడా ఇబ్బంది కరంగా మారింది. అక్విడెక్ట్‌లోని పలు ప్రాంతాల నుంచి రాళ్లు పోవడంతో పెద్ద పెద్ద లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా బయటకు వెళ్తోంది. దీంతో ఇప్పటికే అధికారులు అక్విడెక్ట్‌పై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేసింది. మరమ్మతులకు ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో రైతులే దర్గాహోన్నూరు వద్ద కూలిన వంతెనను చందాలు వేసుకుని బాగు చేసుకున్నారు. మరమ్మతు పనుల కోసం అధికారులు గత ఐదేళ్లలో పలుసార్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది. 12 ఏళ్ల క్రితం ఆధునికీకరణ పనుల కోసం నాటి ప్రభుత్వం విడుదల చేసిన రూ.310 కోట్ల నిధులు తప్ప మరలా ఎలాంటి నిధులు రాకపోవడంతో హెచ్చెల్సీ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులపై శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేయడంతో పాటు అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతులను చేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మాల్యం బ్రిడ్జి



మాల్యం వద్ద ఉన్న హెచ్చెల్సీ ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జికు సంబంధించిన పిల్లర్ల రాళ్లన్నీ ఊడి పోయాయి. ఈ బ్రిడ్జిపైనే కణేకల్లు నుండి ఉరవకొండతో పాటు అనేక గ్రామాలకు వెళ్లే బస్సులు, ఇతరత్రా వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. అనుకోని సంఘటనలు జరిగితే భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

- గురుస్వామి, రైతు, మాల్యం

రూ.36 కోట్లకు ప్రతిపాదనలు: మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈ



హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో అత్యవసర పనుల కోసం రూ. 36 కోట్లకు ప్రతిపాదనలు పెట్టాం. ఇందులో నాగలాపురం, నాగేపల్లి, హోన్నూరు, గెణిగెరతో పాటు ఆరు వంతెనలు, నాలుగు ఎస్కేప్ రెగ్యులేటర్లు ఉన్నాయి. ఇప్పటికే ఆధునికీకరణ పనులలో ఈ వంతెనలకు సంబంధించి పిల్లర్లు సిద్ధంగా ఉన్నాయి. వాటిపై మిగతా పనులు పూర్తి చేస్తే అవి అందుబాటులోకి రానున్నాయి. నిధులు మంజూరై కాలువలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే ఆధునికీకరణలో భాగంగా చేసి వదిలేసిన మిగతా పనులను పూర్తి చేయాలంటే దాదాపు 600 కోట్లు అవసరమవుతుంది.

ఫీల్డ్‌లోకి తమ్ముళ్లు..?

యాడికిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకంలో టీడీపీ నాయకుల దందా

ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయం

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో కొందరు టీడీపీ నాయకులు దందా చేసినట్లు చర్చ జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో వైసీపీ పాలన నుంచి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికీ అలాగే పని చేస్తున్నారు. వారిని తొలగించి టీడీపీ వర్గీయులను నియమించుకోవాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై దందా మొదలుపెట్టినట్లు చర్చ జరుగుతోంది. మా గ్రామపంచాయతీలో మాకు తెలియకుండా మీరెలా పేర్లను ప్రతిపాదిస్తారు? పైగా పోస్టులను మీరు అమ్ముకొని సొమ్ము చేసుకుంటారా అని గ్రామాల్లోని నాయకులు ఆగ్రహంతో ఉన్నారు.

చేతులు మారుతున్న లక్షలు..?

చిక్కేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి, కొత్తగా టీడీపీలోకి వచ్చిన, వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారంటూ సీనియర్ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో రూ2.5లక్షలు చేతులు మారినట్లు చర్చించుకుంటున్నారు. ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నట్లు సమాచారం. కమలపాడు గ్రామ పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకానికి రూ.4లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిట్టూరు గ్రామ పంచాయతీకి సంబంధించి ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేయాలని, వేతనాలు పెట్టకుండా అధికారులచే టీడీపీ నాయకులు వేధిస్తున్నట్లు ఉపాధిహామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. యాడికిలో ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూడా నువ్వు రాజీనామా చేయాలి మావాళ్లను ఎక్కించుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అతను రాజీనామా చేయకపోయేసరికి అధికారులతో నోటీసులు ఇప్పించారని, దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ హైకోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఎంపీడీఓకు హైకోర్టు నుంచి నోటీసులు వచ్చినట్లు సమాచారం. 'నాయకులు బలవంతంగా చేయిస్తున్న పనికి కోర్టుకు తాము వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇదేమి మండలమో ఏమో' అని అధికారులు చిరుబుర్రులాడుతున్నారు. కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న పనికి ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు వస్తున్నట్లు మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బోగస్ మస్టర్లు తయారు చేసేలా కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. లారీ డ్రైవర్లను ఉపాధి కూలీలుగా నమోదుచేసి పనులకు రాకపోయినా లబ్ధి చేకూరేలా చేస్తున్నా రని ఇలాంటి పేర్లు ఇప్పటికే వందల సంఖ్యలో నమోదు చేయించారని ఉపాధి హామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, నియామకం వ్యవహారంపై ఉపాధిహామీ పథకం ఏపీఓ రమేష్‌ను వివరణ కోరగా ఇందులో తనకేమి సంబంధం లేదని, ఇదంతా ఎంపీడీఓ పరిధిలోనే ఉంటుందని తెలిపారు.



వ్యవసాయ మార్కెట్ పాలకుల కోసం

కసరత్తు..!

అనంతపురంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కార్పొరేషన్లకు సంబంధించిన నామినేటెడ్ పోస్టులు ఒక్కొక్కటిగా భర్తీ చేస్తున్నారు. ఈక్రమంలోనే మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఇటీవల ఆదేశాలు అందాయి. ఈ క్రమంలోనే శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లాలోని మార్కెటింగ్ శాఖ అధికారులకు కమిటీ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిగా చేపట్టాలని సూచనలు జారీ చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లాలోని 9మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను ప్రభుత్వానికి అధికారులు నివేదించనున్నారు. ఆతరువాత కమిటీలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఆలస్యంగా గుంతకల్లు-బోధన్ రైలు



గుంతకల్లు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా గుంతకల్లు-బోధన్ (నం. 07671) ప్యాసింజరు ప్రత్యేక రైలును ఆలస్యంగా నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18, 25 తేదీల్లో ఈ రైలును మూడు గంటలపాటు ఆలస్యంగా నడపనున్నట్లు తెలియజేశారు.



అర్హులందరికీ ఇళ్లు

జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శైలజ



అనంతపురం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలందరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)-2 కింద ఇళ్లు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ శైలజ తెలిపారు. ప్రభుత్వ అదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అర్హులను గుర్తించేందుకు డిమాండ్ సర్వేను చేస్తున్నామన్నారు.

● **ప్రశ్న: ప్రభుత్వ ఇల్లు కావాలంటే అర్హతలు ఏవి..?**

జవాబు: ఇల్లు కావాల్సిన వారికి స్థలం పట్టా, డాక్యుమెంట్స్ నివాస ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఒకటి ఉండాలి. వీటితో పాటు తెల్లరేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఎన్‌పీసీఐ లింక్ కలిగిన ఏదైనా అకౌంట్‌తో పాటు ఏడాదికి వారి కుటుంబ ఆదాయం రూ. 3లక్షలులోపు ఉండాలి. గతంలో ప్రభుత్వ పథకం కింద ఇల్లు పొంది ఉండరాదు.

● **డిమాండ్ సర్వే ఎలా చేస్తారు..?**

జవాబు : ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ప్రకారం ఒక యాప్ ద్వారా డిమాండ్ సర్వే చేసి అర్హులను గుర్తించమని అదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామ స్థాయిలో హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినిటీస్ ద్వారా ఇంటింటా డిమాండ్ సర్వే చేసి యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను అప్‌లోడ్ చేస్తే వారు అర్హులా..? కాదా..? అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది.

● **ప్రశ్న : స్థలం ఉన్నవారికేనా ఇల్లు..?**

జవాబు: ప్రస్తుతానికి ప్రభుత్వ అదేశాలు ప్రకారం సొంత స్థలం కలిగిన వారి జాబితా మాత్రమే గుర్తించి అర్హులను ఎంపిక చేయమని ప్రభుత్వం అదేశించింది. ఆ దిశగా సర్వే చేస్తాం. స్థలంతో ఇల్లు మంజూరు విషయంపై ప్రభుత్వం ఇంకా అదేశాలు జారీ చేయలేదు.

ప్రశ్న: ఈ సర్వే ఎప్పటి నుంచి ప్రారంభమైంది..?

జవాబు: గత పది రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించాం. నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగుతుంది. తరువాత అర్హులైన వారందరికి వచ్చే మార్చి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలయ్యే పీఎంఏవై-2 పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తాం.

న్యూస్‌బాక్స్



మాట్లాడుతున్న న్యాయాధికారి

రిమాండ్ దశలో న్యాయసలహాలు తీసుకోండి - డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అరెస్ట్ సందర్భంతోపాటు రిమాండ్ సమయంలో నిందితుడికి ఉన్న హక్కులపై న్యాయసలహా పొందాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక లోక్అదాలత్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పోలీస్ ఆఫీసర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అరెస్ట్, రిమాండ్ స్టేజిలో అందుబాటులో ఉన్న న్యాయ సలహా వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సౌదీలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన యువతీయువకులకు సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి నర్సింగ్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 9988853335, 8790117279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 750 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 11, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.37వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37,280 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 57టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులు జీండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ 2కు 895 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

క్రైంకార్నర్

హత్యకేసు నిందితుడి అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఈనెల 7న నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన కంబన్నను హత్యచేసిన కేసులో పుట్లూరుకు చెందిన చిన్న కంబగిరిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అతడి నుంచి సెల్‌ఫోన్, రూ.300 స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ కంబన్న చిత్తూరు జిల్లాలోని వెంకటాపాళ్యంలో గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పనిచేసేవాడన్నారు. డప్పు కళాకారులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని తీసుకోవడానికి స్వగ్రామానికి వచ్చాడన్నారు. అనంతరం చిత్తూరు వెళ్లేందుకు తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు. స్టేషన్ సమీపంలో ఉన్న మద్యం షాపు వద్ద కంబన్నను నిందితుడు చిన్నకంబగిరి గమనించాడన్నారు. కంబన్నను పరిచయం చేసుకొని ఇరువురు మద్యం బాటిళ్లను తీసుకొని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారన్నారు. 1వ ప్లాట్‌ఫారం చివరికి చేరుకొని కూర్చొన్నారన్నారు. చిన్న కంబన్న వద్ద ఉన్న రూ.1500 నగదు, సెల్‌ఫోన్‌ను నిందితుడు గమనించాడన్నారు. వాటిని కాజేయడానికి వెనుకవైపు నుంచి ఇటుకతో తలపై బాదాడన్నారు. దీంతో చిన్నకంబన్న కిందపడి మరణించాడన్నారు. అనంతరం జేబులో ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించామన్నారు. అందిన సమాచారం మేరకు నిందితున్ని పట్టణంలోని టీటీడీ కల్యాణమండపం వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో రైలు కింద పడి గంగాధర్(28) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. టీ వీరాపురం గ్రామానికి చెందిన గంగాధర తల్లి అంజినమ్మ గత వారంరోజులుగా ఆచూకీ లేకుండా పోయింది. ఆమె అదృశ్యంపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. తల్లి కనిపించకుండా పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ తండ్రి బండా రామన్న వ్యవసాయ కూలీ. గంగాధర్ సైతం వ్యవసాయ కూలీగా ఉండి కుటుంబానికి అండగా ఉండేవాడు. తల్లి ఆ చూకీ లేకుండా పోవడాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కలగానే.. కనీస వేతనం

వేతన మెరుగుదల కోసం కష్టజీవుల ఎదురుచూపు
గత టీడీపీ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
2018లో రాష్ట్రమంతటా పర్యటన
ప్రభుత్వానికి సిఫార్సులు
వైసీపీ పాలనలో అటకెక్కించిన వైనం
కూటమి సర్కారుపై ఆశలు


ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు కనీస వేతనం కలగానే మిగిలిపోతోంది. కష్టానికి తగ్గ వేతనం దక్కక శ్రమ దోపిడీ బారిన పడుతున్నారు. 2010లో నిర్ణయించిన కనీస వేతనాలే కష్టజీవులు, అసంఘటిత రంగ కార్మికులకు నేటికీ అమలవుతున్నాయి. 2017కి ముందే జరగాల్సిన కనీస వేతన సవరణ నేటికీ అమలుకు నోచుకోవట్లేదు. ఈ ఏడున్నరేళ్లలో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 శాతానికి పైగా పెరిగాయి. ఫలితంగా కార్మికుల జీవన వ్యయం అనేక రెట్లు పెరిగింది. అయినా కార్మికుల వేతనాలు మాత్రం పెంపునకు నోచుకోలేదు. 2014 తరువాత కనీస వేతన సవరణలేకపోవడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహా మండలిని ఆదేశించింది. ఆ సలహా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించింది. కార్మికులు, సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. కనీస వేతనాన్ని రూ.21వేలకు పెంచాలని కార్మిక సంఘాలు ముక్తకంఠంతో నినదించాయి. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను నమోదుచేసి, సలహా సంఘం వేతన సవరణపై నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. 2019 ఎన్నికల్లో నెగ్గిన వైసీపీ అధికారం చేపట్టాక కనీస వేతన సవరణను అటకెక్కించింది. కనీస వేతన సలహాబోర్డు నివేదికను బుట్టదాఖలు చేసింది. ఐదేళ్లు ఆ ఊసే ఎత్తలేదు.

లక్షలాది మంది ఎదురుచూపు

ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా లక్షలాదిమంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధరంగాల్లో దినకూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, ఇటుక బట్టీలు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, దుకాణాలు, హోటళ్లు, ప్రైవేటు కంపెనీలు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయాల పెరుగుదలను అధ్యయనం చేసి, కార్మికులతో చర్చించి తదనుగుణంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు వేతన సవరణ సలహా బోర్డును ఏర్పాటు చేశారు. వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సూచనలు ఇస్తుంటుంది.

కేంద్ర ప్రభుత్వం సవరణ..?

తాజాగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని సవరించినట్లు వార్తలు ప్రముఖంగా వచ్చాయి. తాజా సవరణ ప్రకారం నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.783, నెలకు రూ.20,358, సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ.868, నెలకు రూ.22,568, నైపుణ్యం కలిగిన క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు రూ.954, నెలకు రూ.24,804కు పెంచినట్లు కేంద్ర కార్మిక కమిషనర్ వెబ్‌సైట్లో సమాచారం ఉంచారు. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీనిపై కార్మికలకు కూడా అవగాహన లేదు. కనీస వేతన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉండటంతో వారంతా కనీస వేతన సవరణ చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

నిద్రావస్థలో కార్మికశాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన కార్మిక శాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమ దోపిడీకి గురవుతున్నా కార్మిక శాఖ ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల తరఫున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడంగానీ, అధికారులపై ఒత్తిడి తేడవంగానీ చేయడం లేదు. కనీసం ప్రభుత్వాల ప్రకటనలు, చట్టాలను కూడా కార్మికుల దృష్టికి తీసుకెళ్లడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం కారణంగా ఉమ్మడిజిల్లాలో లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం వాటిల్లుతోంది. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ.14వేలే అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వారికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడంలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ కార్మికుల్లో వేతన సవరణ ఆశలు ఊపిరి పోసుకున్నాయి. 2018లో కూటమి ప్రభుత్వంలో సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా ఏడేళ్లలో వాటిల్లిన మార్పులను దృష్టిలో ఉంచుకుని, కనీస వేతన సవరణ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


మాతృదేవోభవ నాటికలోని సన్నివేశం

అలరించిన మాతృదేవోభవ

పుట్టపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ విద్యార్థులు చేపట్టిన మాతృదేవోభవ నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. గుంటూరు జిల్లా భక్తులు పర్తియాత్రగా మంగళవారం స్థానిక ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట బాలవికాస్ చిన్నారులు చెక్కభజన చేశారు. అనంతరం మాతృదేవోభవ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. శివపురాణం, మాతృమూర్తి ప్రేమతత్వంపై చిన్నారులు నృత్యంతో అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సత్యమ్మ ఆలయంలో చోరీ

130తులాల వెండి అభరణాలు, నగదు అపహరణ


ఆలయ తలుపును ధ్వంసం చేసిన దృశ్యం

ధర్మవరంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామ సమీపంలోని సత్యమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయ తలుపు గడియను ధ్వంసం చేసి, దొంగలు చొరబడ్డారు. అమ్మవారికి అలంకరించిన 130తులాల వెండి అభరణాలు, హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ.30వేల నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆలయాన్ని పరిశీలించి, గ్రామస్థులను ఆరాతీశారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉరవకొండలోని రెండిళ్లలో...

బంగారు నగలు, డబ్బు అపహరణ

ఉరవకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో వార్డులో సోమవారం అర్ధరాత్రి దొంగలు రెండిళ్లలో చోరీ చేశారు. స్థానిక బళ్లారి రోడ్డులో నివాసం ఉంటున్న రైల్వే రిటైర్డ్ ఉద్యోగి, టైలర్ ఇళ్లలోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగి సోమ్లా నాయక్ ఈ నెల ఐదో తేదీ ఇంటికి తాళాలు వేసి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇది గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి ఇంటిలోని రూ. 50వేలు నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, ఇంటికి సంబంధించిన పత్రాలను ఎత్తుకుపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అదే భవనంపైన ఉన్న ఇంటిలో వన్నూరుస్వామి నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో తులం బంగారు, రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన నాయుడు, క్లూస్‌టీం పరిశీలించారు. క్లూస్ టీం చోరీ జరిగిన ఇళ్లలో ఆధారాలను సేకరించారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం.. ఫిర్యాదు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన షాజియా(17) మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందని తండ్రి ముస్తఫా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన మేరకు.. షాజియా ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. పదో తరగతి చదువుతున్న బాలికను వరుసకు మామ అయ్యే వ్యక్తికిచ్చి బుధవారం వివాహం చేయడానికి నిశ్చయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ పోలీసులతో కలిసి గ్రామానికెళ్లారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రమేష్.. బాలిక తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహ నేరమన్నారు. అలాచేస్తే కేసు నమోదుచేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. యువతికి పెళ్లి వయసు వచ్చేవరకు ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో లోకేశ్, మహిళా పోలీసు మేనక, పీఎస్ మల్లికార్జున పాల్గొన్నారు.

కాపురాల్లో మంటలు

ఆకర్షణ, ఆర్థిక అవసరాలతో తప్పటడుగులు
పుట్టుకొస్తున్న అనైతిక బంధాలు
దంపతుల మధ్య పెరుగుతున్న గొడవలు
హత్యలు.. ఆత్మహత్యలతో ముగింపు
ఛిద్రమవుతున్న కుటుంబాలు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు దాటింది. ఈ సమయంలో వచ్చిన ఫిర్యాదుల్లో 25శాతానికిపైగా భార్యాభర్తలు చేసుకున్నవే. ఇందులో కొంతమంది భార్యలపై భర్తలు ఫిర్యాదు చేశారు. అందులో ఎక్కువభాగం సెల్‌ఫోన్ మాధ్యమాలు తెచ్చిన తంటాగా గుర్తించారు. తన భర్త సఖ్యతగా లేడనీ, నిత్యం ఫోన్‌లో వేరే మహిళతో మాట్లాడుతుంటాడనీ, తనను వెంట తీసుకెళ్లడానికి ఇష్టపడడనీ, ఒంటరిగా వెళ్లడానికి ఉత్సాహం చూపుతాడని చెబుతున్నారట కొందరు భార్యలు. మరికొంతమంది పురుషులు తమ భార్యలు ఇటీవల సఖ్యతగాలేరనీ, చిన్నవిషయానికే తగాదాపెట్టుకుంటున్నారనీ, స్థోమతకు మించి కోరికలు కోరుతున్నారనీ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, తనను పట్టించుకోవడం లేదని భర్తలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల డివిజన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసులో ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేశారు. తన భార్య మరొకరితో సన్నిహితంగా ఉందనీ, పలుసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోకపోవడంతో హత్యచేసినట్లు విచారణలో భర్త ఒప్పుకున్నాడు. కొన్నినెలల క్రితం ఓ మండలంలో తన భర్త.. ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదనీ, తన, పిల్లల బాగోగులు చూసుకోలేదనీ, అయినా అతడిపై



ప్రేమ ఎక్కువ అనీ, ఈ కారణంతో తానే తనువు చాలిస్తున్నానని చుట్టుపక్కలవారికి చెప్పి ఆత్మహత్య చేసుకుంది ఓ మహిళ. హిందూపురం పట్టణంలో కొన్నినెలల క్రితం ఓ దుకాణం నిర్వహించే వ్యాపారి అందులో పనిచేసే మహిళతో సంబంధం పెట్టుకున్నాడని ఆమె భర్త గొడవకు దిగాడు. షాపు యజమానిపై దాడి చేశాడు. దుకాణ యజమాని కుటుంబం ఉన్నతమైనది కావడంతో బయటకు పొక్కకుండా దుప్పటి పంచాయితీ చేశారు. వారం క్రితం హిందూపురం పట్టణంలోని ఒకేరోజు మూడు కుటుంబాలవారు స్టేషన్‌కు వచ్చారు. ఆ మూడు కుటుంబాలవారు వివాహేతర సంబంధాలను కారణంగా చూపుతూ విడాకులు కోరారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. పోలీసు స్టేషన్‌కు చేరనవి కోకొల్లలు.

వివాహేతర సంబంధాలు ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. మూడు ముళ్ల బంధంతో ఒక్కటై, ఏడడుగులు నడిచి అన్యోన్యంగా ఉంటూ పరస్పర ప్రేమానురాగాలతో జీవించాల్సిన భార్యాభర్తలు అనైతిక బంధాలతో తప్పటడుగులు వేస్తున్నారు. ఒకరు చేసిన తప్పిదానికి కుటుంబం మొత్తం బలైపోతోంది. వీటికి కొన్నిసార్లు హత్యలు, ఆత్మహత్యలతో ముగింపు పలుకుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వారిని కటకటాలపాలు చేస్తున్నాయి. వారిపై ఆధారపడిన కుటుంబీకులు రోడ్డున పడుతున్నారు. అభం శుభం తెలియని వారి పిల్లల జీవనం దయనీయంగా మారుతోంది.

ఆకర్షణ, ఆర్థిక అవసరాలు..

ఇటీవల వివాహేతర సంబంధాల కారణంగా పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కిన కొందరి వివరాలు చూస్తే ఆకర్షణకు లోనై, అది ప్రేమగా మారి చివరకు ప్రాణాలమీదకు తెస్తున్నాయి. ఇటీవల మహిళలుగానీ, పురుషులుగానీ స్టేషన్‌లో చెబుతున్న వివరాలు పరిశీలిస్తే ఆర్థిక అవసరాలతో అనైతిక బంధాలు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది మహిళలను విచారించిన సమయంలో పోలీసులు చెబుతున్న వాటిని బట్టి పరిశీలిస్తే ఇరుగుపొరుగువారు, స్నేహితులు, బంధువులు, హోదాను బట్టి తాము కూడా అలాగే ఉండాలని భావిస్తున్నారు. వారికి ఆ స్థోమత ఉండదు. దీంతో ఆర్థిక అవసరాలను బట్టి తప్పటడుగులు వేస్తున్నారు.

అనుమానాలే పెనుభూతాలై..

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అత్యవసరమైన వస్తువుగా మారిపోయింది. ఇది భార్యాభర్తల మధ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్త వ్యక్తులతో పరిచయం, ఆ తరువాత ప్రేమ, వివాహేతర సంబంధాలకు దారితీస్తోంది. ఒకప్పుడు పరాయి పురుషుడితో మాట్లాడాలంటేనే జంకేవారు. సెల్‌ఫోన్ పుణ్యమా అని ఎవరితోనైనా, ఎక్కడినుంచైనా మాట్లాడుతున్నారు. ఇది వివాహేతర సంబంధాలకు దారితీసి, ఆలుమగల మధ్య అనైక్యతకు తావిస్తోంది. బయటి వ్యక్తులపట్ల ఆకర్షణకు కారణమవుతోంది. ఇటువంటి వ్యవహారాలు జీవితం అథఃపాతాళానికి పడిపోయేలా చేస్తున్నాయి. భార్య తనను మోసం చేసిందని భర్త, తాళి కట్టిన భర్త వేరే మహిళ మోజులోపడి తనను దూరం పెడుతున్నాడని భార్యకు అనుమానం పెంచుకుంటున్నారు. కొంతమంది ఎక్కువ మందితో పరిచయాలు పెట్టుకోవడంతో హత్యలకు దారితీస్తున్నాయి. వివాహేతర సంబంధాల విషయంలో భార్యాభర్తల మధ్య ఎక్కువగా కక్షసాధింపులు జరుగుతున్నాయి. అనైతిక సంబంధాలు వద్దని ఇంట్లోవారు వారిస్తే ఆత్మహత్యలు చేసుకునేందుకు కూడా వెనుకాడటంలేదు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో నచ్చజెప్పేవారులేక భార్యాభర్తలు ఎవరికివారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇరువురి మధ్య బంధం కాస్తా.. వైరంగా మారుతోంది. కొంతమంది యువకులు చేసే పనుల కారణంగా ఎంతో పరువుగా బతికిన వారి కుటుంబాలు తలదించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

సూచనలు.. అభ్యంతరాలు తెలపండి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప-వర్గీకరణపై ఆయా కులాలవారు అభ్యంతరాలు, సూచనలు తెలపాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఉప-వర్గీకరణపై రాజీవ్‌రంజన్‌మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను విజయవాడలోని గిరిజనసంక్షేమశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారన్నారు. ఈవిషయంపై సంతకంతో కూడిన రాతపూర్వక అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు వ్యక్తిగతంగాగానీ, పోస్టుద్వారాగానీ, omcscsbclassificatongmail.com వెబ్‌సైట్ ద్వారాగానీ అభ్యంతరాలు, సూచనలు పంపవచ్చన్నారు. జనవరి 9వతేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంటిమడుగు గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ముంటిమడుగుకు చెందిన వంశీ బొలెరో వాహనం నడుపుతుండేవాడు. కొన్నిరోజుల క్రితం మండలానికి చెందిన ఓ యువతిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆయుర్వేద వైద్యాధికారి పోస్టుల ఎంపిక జాబితా విడుదల

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగం ఆయుర్వేద వైద్యాధికారి పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఏపీపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. మొత్తం 67 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపింది. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది ఫలితాలను వెల్లడించింది.

దేవుడి భూమి సైతం..

చెన్నకేశవుడి మాన్యం అన్యాక్రాంతం
సక్రమంగా కౌలు చెల్లించని వైనం
పర్యవేక్షణ లేకపోవడం వల్లే..?


దేవదాయ భూముల్లో సాగు చేసిన ఉలవ పంట

శింగనమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో దేవుడికి ఇచ్చిన మాన్యం భూములు కొన్ని అన్యాక్రాంతమవుతున్నాయి. ఉన్న భూమిని కౌలుకు తీసుకున్నవారు సైతం సక్రమంగా కౌలు చెల్లించడం లేదు. దీంతో దేవదాయశాఖ ఆదాయానికి గండిపడుతోంది. అనంతపురం పాతూరు లక్ష్మీ చెన్నకేశవ స్వామికి మండలంలోని చిన్నజలాలపురంలో 150 ఎకరాల మాన్యం భూమి ఉంది. ఇందులో చాలా వరకు కబ్జా అవుతోంది. గ్రామంలో 150 ఎకరాలు మాన్యం భూములు వెస్టునరసాపురం రెవెన్యూ గ్రామం సర్వేనంబర్లు 115,116,117 118 145, 175 187 188 191 192 193 210 212 213 214 216ల్లో 150 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఈ భూములను ప్రతి సంవత్సరం వేలం ద్వారా రైతులకు కౌలుకు ఇస్తారు అయితే గతంలో భూములు బాగానే సాగులో ఉండేవి. గత 12 సంవత్సరాలుగా వేలం సక్రమంగా నిర్వహించకపోవడంతో అప్పుడు పలుకుబడి ఉన్న వ్యక్తులు 10 నుంచి 20 ఎకరాలు వేలం తీసుకుని, అంతో ఇంతో రుసుం చెల్లించి చేతులు దులుపుకున్నారు. పర్యవేక్షణ చేయవలసిన దేవదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో 30 ఎకరాల నుంచి 40 ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. చాలా భూములను ఇప్పటికై కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. అధికారుల మాత్రం కబ్జాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం కబ్జాదారులకు నోటీస్‌లు కూడా జారీ చేయకపోవడం గమనార్హం.

16న వేలం వేస్తున్నాం: శోభారాణి, ఈఓ

అనంతపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి మాన్యం భూమి చిన్నజలాలపురంలో 150 ఎకరాలు ఉంది. ఈ భూములకు ఈనెల 16న కౌలు వేలం వేస్తున్నాం. రైతులు కౌలును బహిరంగ వేలంలో పాడుకోవచ్చు. ఈ భూములను ఎక్కడైనా, ఎవరైనా ఆక్రమించి ఉంటే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి భూమిని స్వాధీనం చేసుకుంటాం. వేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత కబ్జాపై విచారణ చేస్తాం.


బీడుగా దేవదాయ భూములు

సంక్షిప్తం

ఈ పంట నమోదు చేసుకోండి

అనంతపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శశికళ పేర్కొన్నారు. మండలంలోని కొడిమి, నరసనాయని కుంట గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె హాజరై మాట్లాడారు. పంట ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ఏఈఓ మురళీకృష్ణ, రైతు సేవా కేంద్రం సహాయకులు రాజేశ్వరి, టీడీపీ నాయకులు నాగేంద్ర, ప్రసాద్ హనుమంతు, అశ్వర్థ, ఈశ్వరయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

నార్పల డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు నార్పల సమీప ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకుల నుంచి నైపుణ్య శిక్షణ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నార్పల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ తెలిపారు. ఇంటర్ ఆపై విద్యార్హత కలిగిన వారికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మూడు నెలలు శిక్షణ ఇచ్చి ఉపాధి అవశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9010039901, 9347565078 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వైసీపీ ర్యాలీ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై ఈనెల 13న నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా నేతలు పిలుపునిచ్చారు. ఈనెల 13న నిర్వహించనున్న అన్నదాతకు అండగా వైఎస్ఆర్సీపీ' ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను మంగళవారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, నగర మేయర్ మహమ్మద్ వసీం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల సమన్వయకర్తలు రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గార్లదిన్నె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రగుంట్ల సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. యర్రగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాధితురాలికి చేయూత



నిత్యావసరాలు అందిస్తున్న నిర్మలామురళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. నగరంలోని మదర్ థెరిస్సా కాలనీలో నివాసముంటున్న కుళ్లాయమ్మ క్యాన్సర్ కారణంగా ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితమైంది. ఆమె ఆపరేషన్ కోసం రూ.6లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చాలా పేదకుటుంబం అని తెలుసుకున్న నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి మంగళవారం వారిని కలిసి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, అందజేశారు.

సజావుగా పింఛన్ల పరిశీలన

అనంతపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో అధికారులు మంగళవారం పింఛన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టారు. 11 బృందాలు పాల్గొన్నాయి. ఒక్కో బృందం 40 పింఛన్ల పరిశీలన చేశారు. ఇంటింటికి వెళ్లి పింఛన్ దారులకు పదికిపైగా ప్రశ్నలతో వివరాలు ఆరా తీశారు. సంబంధిత ధృవపత్రాలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. లబ్ధిదారుల ఫొటో, వేలిముద్రలు అప్‌లోడు చేశారు. ఈప్రక్రియను డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డీఎల్‌డీఏ లలితాబాయి పర్యవేక్షించారు. పీడీ మాట్లాడుతూ.. గ్రామంలో 424 పింఛన్లు ఉన్నాయన్నారు. ఇందులో 407 పింఛన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారని తెలిపారు. 15 మంది అందుబాటులో లేరని, ఇద్దరు మృతిచెందినట్లు తెలిపారు.

రోడ్డ ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



వన్నూరప్ప(ఫైల్)

రామగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకొండాపురానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ వన్నూరప్ప(38) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వన్నూరప్ప పేరూరులో క్లినిక్‌ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు అయన పెద్దకొండాపురం నుంచి పేరూరు వచ్చి వెళ్లేవాడు. రోజులాగే మంగళవారం క్లినిక్‌కోసం ఉదయం బయలు దేరి వచ్చాడు. పేరూరు సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కిలోమీటరు రాయిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పేరూరు ఆస్పత్రికితరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. తలకు బలమైన గాయం కావడంతో మృతిచెందినట్టు డాక్టర్ పేర్కొన్నారు. అతడికి మూర్ఛరోగం కూడా ఉందని, దాని వల్లకూడా ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. పోలీసులు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

- గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు
- గోకులం షెడ్ల నిర్మాణాలు



కొండపల్లి వద్ద నాడు గుంతలమయమైన రహదారి



నేడు ప్యాచ్‌వర్క్ చేసిన అనంతరం

కనగానపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడింది. నిధులు లేకపోవడంతో గ్రామాల్లో వీధిలైట్లు, సీసీ రోడ్లు, తాగునీరు వంటి కనీస వసతులను కల్పించలేదు. దీంతో గ్రామ వీధులు మురుగునీరు, వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారా యి. వాటిపై సంచారానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడారు. అయితే కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే వివిధ రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. కనగానపల్లి మండలంలో పనులకు ఎమ్మెల్యే పరిటాల సునీత రూ. కోట్లు మంజూరు చేయించారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఉపాధి పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తూనే... చిన్న, సన్నకారు రైతుల కు పండ్ల మొక్కలు మంజూరు చేశారు. అదేవిధంగా పాడి రైతులకు గోకులం షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇంకా రూ. 3.60కోట్లతో సీసీ రోడ్ల పనులు చేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు బురద మయంగా ఉన్న రోడ్లు సౌకర్యవంతం గా మారుతుండటంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంతల మయంగా ఉన్న రహదారుల్లో ప్యాచ్‌వర్క్ పనులు, కోతకు గురైన రోడ్లకు ఇరు వైపులా మట్టి పనులు చేస్తున్నారు. గుంతలు పడిన రహదారులతో ఇబ్బందులు పడ్డ ప్రజలు నేడు చేస్తున్న అభివృద్ధి పనులతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



మామిళ్లపల్లిలో గోకులం షెడ్ నిర్మాణం

శ్మశానానికి వేరే స్థలం కేటాయించండి

●ఎమ్మెల్యే పరిటాల సునీతకు కామారుపల్లి వాసుల వినతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఊరికి అగ్నిమూలన శ్మశానం ఉందని, మరోచోట స్థలం కేటాయించాలని కామారుపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విజ్ఞప్తి చేశారు. మండలపరిధిలోని కామరుపల్లిలో తహసీల్దార్ మోహన్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీఓ కేశవనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ప్రతిపాదనపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు విముఖత చూపారని . ఆ స్థలల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. శ్మశాన వాటిక విషయంలో గ్రామస్థులు సమష్టి నిర్ణయానికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ... రెవెన్యూ సమస్యలకు సంబంధించి కోర్టులో ఉన్నవి తప్ప మిగిలిన అన్నింటిని నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఆర్ఐ సందీప్, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, చిన్నంపల్లి సర్పంచు శివశంకర్, ఎంపీటీసీ రజిత, తెలుగు రైతు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ సర్పంచు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల సమర్థవంతంగా అమలుచేయండి : కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలుచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ భవన్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రభుత్వం అత్యంత ప్రా ధాన్య మిస్తున్న ఉచిత ఇసుక, ఎక్సైజ్, ధరలు, వరి కొనుగోలు, పింఛన్ల పంపిణీ, గుంతల రోడ్లు, అన్న క్యాంటీన్లు, దీపం పథకం, దేవాలయాలకు సంబంధించిన 13శాఖల అధికారులు ప్రత్యేక బాధ్యతగా పనిచేయాలన్నారు. వీటి పర్యవేక్షణకు ఓ అధికారిని ఎన్ఐసీ కంట్రోల్ రూమ్‌లో నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ వీర్రాజు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణచౌదరి, డీసీఓ అరుణకుమారి, నగర పాలక కమిషనర్ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

మద్యం డంప్ చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్

రాప్తాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే గేటు సమీపంలోని ఒక తోటలో భారీగా గోవా మద్యం డంప్ చేసిన వారిని, వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. రాప్తాడు సమీపంలో సోమవారం భారీగా గోవా మద్యం పట్టుబడటంపై ఎమ్మెల్యే మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో ఫోన్‌లో మాట్లాడారు. గోవా మద్యం డంప్ వెనుక ఉన్న సూత్రధారులెవరని ఎక్సైజ్ అధికారులతో ఆరా తీశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నందున పూర్తి వివరాలతో త్వరలో తెలియచేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు. ఈ స్కాంలో ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే సూచించారు.రాప్తాడు పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించండి

● ఫుడ్ కమిటీ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



బుక్కరాయసముద్రంలో వంట మనుషులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిటీ చైర్మన్

బుక్కరాయ సముద్రం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ ఫుడ్ కమిటీ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశా. పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని, కిచెన్ స్టోర్ రూమ్‌లో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. భోజనం నాణ్యత, మెనూ అమలు, బోధన తదితర అంశాలపై విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగవేణిని అభినందించా. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపడీఓ సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

●నార్పల: స్థానిక మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిటి చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం సదర్శించారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏవైనా అసౌకర్యాలు ఉంటే తన దృష్టికి తీసుకునిరావాల సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య ప్రిన్సిపాల్ సంగీత కుమారి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

శింగనమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): టీడీపీలో బీసీ, బడుగు, బలహీన వర్గా అభివృద్ధితోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు నాయీబ్రాహ్మణల సంక్షేమానికి పెద్ద పీట వేశారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం ఆదినారాయణ అన్నారు. శింగనమలలో మంగళవారం నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాలర్పించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన ఆదినారాయణను ఘనంగా సత్కరించారు.

దివ్యాంగులు, వృద్ధుల కోసం లిఫ్ట్ ప్రారంభం



ప్రారంభోత్సవ పూజలు చేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సమస్యలను విన్నవించుకోవడం కోసం వందలాదిమం దివస్తున్నారు. అందులో దివ్యాంగులు, వయసు మీరిన వృద్ధుల పట్ల కలెక్టరు వినోద్‌కుమార్ తమ పెద్దమనసు చూపారు. అలాంటి వారు ఇబ్బందులు పడకుండా రెవెన్యూభవన్‌లోకి వచ్చేందుకు ప్రత్యేకంగా లిఫ్ట్ ఏర్పాటు చేయించారు. దానిని మంగళవారం కలెక్టరు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేయించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్ఓ తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఈసెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, మెజిస్టీరియల్ విభాగం సూపరింటెండెంట్ వసంతలత, ఎన్నికలసెల్ డీటీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ట్యూటర్ పోస్టుల రద్దును ఆపాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటికి సీపీఎం వినతి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్య కళాశాలలో ఒకేసారి 33 ట్యూటర్ పోస్టులను రద్దు చేయడం తగదని, వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా సర్వజనాస్పత్రికి అనుబంధంగా 100 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించి, క్రమేపీ 200కు పెంచారని గుర్తుచే శారు. అయితే తగిన సిబ్బందిని పెంచలేదని తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రికి 560 పడకల కేటాయింపు ఉందని, ఉన్న పరిమిత సిబ్బందితోనే 1200 మందికి పైగా ఇన్‌పేషెంట్లు, 2500 మందికి పైగా ఔట్‌పేషెంట్లకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. పడకల సంఖ్యను 1200కు పెంచి, సరిపడా వైద్య సిబ్బందిని కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే ట్యూటర్ పోస్టుల రద్దుపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్వీ నాయుడు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదానీ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలి: సీపీఐ

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గౌతమ్ అదానీ అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల న్నారు. ప్రధాని మోదీ బినామీ అదానీ ప్రపంచ వ్యాప్తంగా రూ. 6,300 కోట్లు సేకరించి, దేశం లోని ఐదు రాష్ట్రాల్లో వేలకోట్లు లంచాలు ఇచ్చారన్నారు. గత సీఎం జగన్‌కు ఏకంగా రూ. 1750 కోట్లు ముడుపులు ఇచ్చినట్లు ఆధారాలతో అమెరికాలో కేసులు నమోదయ్యాయన్నారు. దేశంలో బీజేపీ మూకలు చేస్తున్న దాడులను అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర సహాయకార్యదర్శి రమణయ్య, అల్లిపీరా, బంగారు బాష, నారాయణస్వామి, మున్నాఫ్, కృష్ణుడు, శ్రీనివాస్, మోహన్‌కృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల : అదానీ అవినీతిపై విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నప్పయాదవ్ డిమాండ్‌చేశా రు. సీపీఐ స్థానిక కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధాలపై సమావేశం నిర్వహించారు. చిన్నప్పయాదవ్ హాజరై మాట్లాడారు. నాయకులు మధుయాదవ్, చంద్రశేఖర్, ఆది, చితంబరి తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ వైఖరి నశించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాలెం నారాయణస్వామి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలోని గాంధీ కూడలిలో సీపీఐ నాయకులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. నాయకులు గంగాధర్, చేపల రామాంజి, పెద్దయ్య, లలితమ్మ, సుధాకర్ సంజీవరాయుడు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● జేసీ శివనారాయణ్ శర్మ



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గార్లదిన్నె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ తెలిపారు. మండల పరిధిలోని కేశవాపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఏళ్ల తరబడి భూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రీసర్వేతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. భూసమస్యలను సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించిందన్నారు. అనంతరం భూ స మస్యలపై పలు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బండా రు ఈరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామాంజినేయులు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ దివాకర్‌రెడ్డి, ఎండోమెంట్ ఈఓ బాబు, మాజీ సర్పంచు శ్రీరాములు, అంజినేయులు, కిష్టయ్య పాల్గొన్నారు.

● శింగనమల: రెవెన్యూ సదస్సు వచ్చిన భూ సమస్యలను 45 రోజులలో పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి బషీర్, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య పెర్కొన్నారు. మండలంలోని చిన్నమట్లగొంది గ్రామం లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ నిర్మలాకూమారి, రీసర్వే డిప్యూటీ తహసీ ల్దార్ పునీత్, నల్లప్ప, గుర్రప్ప, వెంకటరామిరెడ్డి సర్పంచ్ రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో జాయిన్ అయిన కోదండరామిరెడ్డి

అనంతపురం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారిగా కోదండరామిరెడ్డి తిరిగి హైకోర్టు ఉత్తర్వులతో జాయిన్ అయ్యాడు. గత 10రోజుల క్రితం వైద్యశాఖాధికారులపై వివిధ ఆరోపణలు చేయడంతో పాటు డీసీహెచ్ఎస్ అధికారితో మాట్లాడిన ఆడియోవాయిస్‌ను సోషల్‌మీడియాలో పెట్టడంపై... కలెక్టరుకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కలెక్టరు విచారణ జరిపించి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనను కడప ప్రాంతీయ వైద్యశాఖ ఆర్డీ కార్యాల యానికి సరెండర్‌చేస్తూ ఉత్తర్వులు ఇచ్చా. ఈ ఉత్తర్వులపై కోదండరామిరెడ్డి హైకోర్టుకు వెళ్లారు. అక్కడ కోర్టు కలెక్టరు ఉత్తర్వులపై ఇంటీరియమ్ ఆర్డర్ ఇచ్చినట్లు జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టరు ఓబులు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి ఉరవకొండలో జాయిన్ అయ్యారని తెలిపారు.

ముగ్గురు టీడీపీ నాయకులకు ప్రశంసాపత్రాలు



నాయకులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నాయకులు మంజునాథ్, దాదాపీర్ మన టీడీపీ యాప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రశంసా పత్రాలను మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వారికి అందజేశారు. శాలువాలు కప్పి సన్మానించి, అభినందించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత గా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, పరమేశ్వరన్, గోళ్ల సుధాకర్ నాయుడు, నెట్టెం బాలకృష్ణ, శ్రీవర్ధన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విరాళం



ఎమ్మెల్యేకి నగదు అందజేస్తున్న పరమేశ్వరన్

అనంతపురం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ నియోజకవర్గంలో పేదలతో సభ్యత్వం చేయించేందుకు రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేశ్వరన్ రూ.50వేలు విరాళం ఇచ్చారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు ఆయన అందజేశారు. ఇప్పటికే నగరంలోని రజకనగర్, గంగానగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో 500 సభ్యత్వాలను తాను ఉచితంగా చేయించినట్లు పరమేశ్వరన్ తెలిపారు. టీడీపీ నాయకులు సరిపూటి రమణ, విష్ణు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



చిన్నజలాలపురంలో ఎమ్మెల్యేని సన్మానిస్తున్న కురుబ కులస్థులు

శింగనమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాలు, కురుబల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంగళవారం మండలపరిధిలోని చిన్నజలాలపురంలో ఓ కార్యక్రమానికి వెళ్లారు. ఈ సందర్భంగా కురుబ కులస్థులు పెద్ద ఎత్తున సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబల సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. టీడీపీ నాయకులు డేగల కృష్ణమూర్తి షాలిని బ్యాళ్ల నాగేంద్ర, అట్టే ధనుంజయ, పట్నం నగేష్, వీరానాయణప్ప లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని రహదారిపై అరబెట్టకండి

● జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ

గార్లదిన్నె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వరి రైతులెవరూ జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. ఆయన మంగళవారం కల్లూరులోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు తక్కువరేటుకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కావున రైతులు . ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని తెలిపారు. ముఖ్యంగా రానున్న మూడు రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ధాన్యాన్ని జాతీయ రహదారిపై అరబెట్టవద్దన్నారు. జాతీయ రహదారిపై ధాన్యాన్ని అరబెట్టడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా రైతులు ఏకే నరసింహులు, సామాల మధు, రామాంజి, నలపరెడ్డి, బ్రహ్మానందరెడ్డితో పాటు పలువురు మాట్లాడుతూ... వరిధాన్యాన్ని అరబెట్టుకునేందుకు సరైన స్థలం లేకపోవడంతో జాతీయ రహదారిపైనే అరబెట్టుకోవాల్సి వస్తోందని, ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీ రవి, ఏఓ సోమశేఖర్, సవిల్ సప్లయి, సిబ్బంది పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 13వ తేదీన టీవీ టవర్ సమీపంలో ఉన్న గ్లోబల్‌స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల మూడో వారంలో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామాగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9949279330, 9398969691ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్-14 బాలుర ప్రాబబుల్స్ జట్టుకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందులో కిరణ్‌కుమార్, ఆదినారాయణ రెడ్డి, లిఖిత్, ప్రాణధీర్, రోహిత్ ఎంపికయ్యారు. అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు విజయనగరంలో అండర్-14 ఏసీఏ బాలుర జట్టు ప్రాబబుల్స్ శిక్షణా శిబిరంలో పాల్గొంటారు. ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

12న జిల్లా రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రగ్బీ జిల్లా అండర్-15 బాల, బాలికల చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 12వ తేదీన బత్తలపల్లిలో ఉన్న ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, టోర్నీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. 2009 నుంచి 2011 సంవత్సరాల మధ్యలో జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామాగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 8106674037, 9704108321ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా..

ఆశా వర్కర్ ఆత్మహత్యా యత్నం

ఉరవకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో సచివాలయంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ శర్మాష్ బీ వేధింపులు తాళలేక మంగళవారం మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. సచివాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ సులోచన చీటికి మాటికీ వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై సచివాలయంలోనే మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. తోటి ఉద్యోగులు ఆమెను చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గుత్తి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లిలో మంగళవారం పురుగుల మందుతాగి లక్ష్మీదేవి (70) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మనిషి స్వేచ్ఛను కాపాడేవి మానవ హక్కులు

గుంతకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మనిషికి స్వేచ్ఛాయుత జీవితాన్ని ప్రసాదించేవి మానవ హక్కులని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శస్త్ర కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1948 డిసెంబరు 10న ఐక్యరాజ్య సమితిలో విశ్వమానవ హక్కుల ప్రకటన చేసిందన్నారు. మానవ హక్కుల గురించి, వివిధ న్యాయ సేవా సంస్థల పనితీరుపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు గుమ్మనూరు నాగార్జున, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుజిరీ దుకాణాలను తరలించండి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న గుజిరీ వ్యాపార దుకాణాలను జనవరి 15లోపు మరోచోట ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. గుజిరీ వ్యాపారులు తీసుకు వస్తున్న ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలు రోడ్డుపైకి వచ్చి వాహనదారులకు, ప్రజలకు అసౌకర్యంగా ఉండడంతో షాపులను మరోచోట ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ యువ నాయకుడి మృతి

కుందుర్పి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కుందుర్పిలో టీడీపీ యువ నాయకుడు కురుబ రామకృష్ణ మంగళవారం ఉదయం అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు రామకృష్ణ భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, మల్లికార్జున, ఈరన్న, హనుమంతప్ప, కామన్న పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె బస్టాప్ వద్ద ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.25వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అరెస్ట్‌చేసి ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

కాలువ మరమ్మతులకు చర్యలు

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట- పుట్లూరు గ్రామాల మధ్య హెచ్చెల్సీ కాలువ దగ్గర గండి పడడంతో మంగళవారం అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువలో కిందిభాగాన రంధ్రానికి మరమ్మతులు చేపట్టారు. త్వరగా హెచ్ఎల్‌సీ కాలువ మరమ్మతులను చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలకు అభ్యర్థుల ఖరారు

పామిడి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్చెల్సీ ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఎన్డీఏ అభ్యర్థులను ఖరారు చేసినట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రెండు డైరెక్టర్ స్థానాలకు మజ్జిగ నరసింహప్ప, బోయ వెంకటేష్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేయడంతో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, ఆనంద్, సుదర్శన్, మహానంది, హరికృష్ణ, సుంకప్ప పాల్గొన్నారు.

రక్తదాతకు ప్రశంసా పత్రం

గుంతకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బంటనహాల్ హనుమంతు అనే రక్తదాతకు కాకినాడకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కాకినాడలోని డి-కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో హనుమంతుకు ప్రశంసా పత్రం అందించారు. ప్రాణ దాత సేవా సమితి అనే స్వచ్ఛంద సంఘం పేరిట రక్తదానం చేయడం, ఇతరులచే రక్తదానాలు చేయించారని అతడి సేవలను కొనియాడారు.

ఉద్యాన పథకాలపై అవగాహన

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖలో అమలయ్యే పథకాలపై ఎస్సీ, ఎస్టీ రైతులు అవగాహన చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి మౌనిక పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌బీవంక గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యాన శాఖలో వర్తించే పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిలచారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం చీనీ, మామిడి, జామ, అంజూర, డ్రాగన్ ఇతర పండ్లతోటల పెంపకానికి ఉద్యానవన శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రోత్సాహం ఉంటుందన్నారు.

హాకీలో ఉత్తమ ప్రతిభ

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన హాకీ టోర్నమెంట్లో కళ్యాణదుర్గం శ్రీచైతన్య టెక్నో స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం అండర్ 10 విభాగంలో పూజిత, సిమ్రాన్, అండర్ 8 విభాగంలో లావిన్ రాగన్, హర్షిత్ ప్రీతమ్, విబు, వీరు, మిక్స్ జెండర్ ఫెస్టివల్ గేమ్‌లో విన్నర్స్, రన్నర్స్‌గా గెలుపొందారు.

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం

బొమ్మనహాళ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ కోసమే టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, బలరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ సొసైటీ లో వరి ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2300, గ్రేడ్ ఏ రూ. 2320 కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని వారు తెలిపారు.

భూవివాదంలో ఘర్షణ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూతగాదా లో ఘర్షణపడడంతో గంగాధర్ అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చదం గ్రామంలో మంగళవారం ఘటన చోటు చేసుకుంది. దోణప్ప కుమారుడు గంగాధర్‌కు పెద్ద గంగప్ప కుమారుడు వంశీ, చిన్న గంగప్ప కుమారుడు శీనప్ప భూతగాదాలపై గతంలో గొడవపడి పంచాయితీలు చేసుకున్నారు. పొలంలో పని చేసుకుంటుండగా గంగాధర్‌పై వంశీ, శీనప్ప ఘర్షణకు దిగి గాయపరిచారు.

విస్తరిస్తున్న ఇసుక దిబ్బలు

- ఎడారి నివారణ ఎండమావేనా..?
- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఇసుకమేటలతో రైతులకు ఇబ్బందులు



దర్గాహోన్నూరు వద్ద ఇసుకమేటలు

బొమ్మనహాళ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో విస్తరిస్తున్న ఇసుక దిబ్బలు ఎడారిని తలపిస్తున్నాయి. ఇసుకమేటలను తొలగించే పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో ప్రతి యేటా రైతులు నట్టేట మునుగుతున్నారు. దర్గాహోన్నూరు, కళ్లహోళ, గోవిందవాడ, బొల్లనగుడ్డం, బిదురకుంతం, తుంబిగనూరు, నాగేపల్లి, మాల్యం, కళేకుర్తి గ్రామాల్లో వేదావతి హగరిలోని సున్నితమైన ఇసుక కొట్టుకువచ్చి దిబ్బలుగా ఏర్పడుతోంది. బొమ్మనహాళ్, కణేకల్లు, బెళుగుప్ప మండలాల్లో సుమారు 4500 ఎకరాల్లో ఇసుకమేటలు విస్తరించాయి. ఆషాఢ మాసంలో వీచే గాలులకు ఇసుక కొట్టుకువచ్చి దిబ్బలుగా ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఇసుక ఎలాంటి కట్టడాలకు ఉపయోగపడదు. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎడారి నివారణ పథకాన్ని చేపట్టింది. నిధులు మంజూరు చేసి నివారణ చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అప్పుడు జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ. 16 కోట్లు మంజూరు చేయించారు. నాగేపల్లి, తుంబిగనూరు, దర్గాహోన్నూరు గ్రామాల వద్ద ఇసుక తొలగింపు పనులను ప్రారంభించారు. ఇసుకను చౌడుభూములకు తరలించి సారవంతంగా మార్చేందుకు అవకాశం కల్పించింది. ఉచితంగా వ్యవసాయబోర్లు, డ్రిప్ సౌకర్యం కల్పించి ఇసుకను చౌడుభూములకు తరలించేందుకు శ్రీకారం చుట్టారు. బొల్లనగుడ్డం గ్రామంలో పండ్ల మొక్కల సాగు చేయించారు. హైబ్రీడ్ రేగుచెట్లను పెంచారు. ఇది సత్ఫలితానిచ్చింది. వేరుశనగ పంటపై ఇసుక కొట్టుకురాకుండా పొలం చుట్టూ మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని నిర్వీర్యం చేసింది. ఆ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఐదేళ్లలో ఎడారి నివారణ పథకాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చౌడుభూములను సారవంతంగా చేసేందుకు ఈ ఇసుకను తరలించేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

ఇసుక తరలించాలి



వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎడారి నివారణ పథకం నిర్వీర్యమయింది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మా పొలాలకు వ్యవసాయ బోర్లు వేయించి డ్రిప్ సౌకర్యం కల్పించారు. సపోటా, హైబ్రిడ్ రేగు చెట్ల పెంపకం చేపట్టాం. వైసీపీ ప్రభుత్వం ఇసుక దిబ్బల్లో ఒక్క బోరు వేయించలేదు. ఐదేళ్లలో ఎడారి నివారణ పథకాన్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుకను తరలించడానికి చర్యలు తీసుకోవాలి.

- ఆనంద్, రైతు, దర్గాహోన్నూరు

పంటల సాగుకు అవస్థలు



పొలాల్లో ఇసుక దిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఏటా పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక దిబ్బలు తరలించడం కష్టంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎడారి నివారణలో భాగంగా నల్లరేగడి నేలల రైతుల పంట పొలాలకు ఉచిత ఇసుక తరలింపు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుక దిబ్బల నివారణను అటకెక్కించింది. మరోసారి ఎడారి నివారణకు చర్యలు తీసుకోవాలి.

- వీఎల్ రామాంజనేయులు, రైతు, దర్గాహోన్నూరు

రెవెన్యూ సదస్సుల్లో వినతుల వెల్లువ

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)



కూడేరు మండలం ఉదిరిపికొండలో వినతి పత్రాలు ఇస్తున్న రైతులు

రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై మంగళవారం అధికారులకు వినతి పత్రాలు అందించారు. కూడేరు మండలం ఉదిరిపికొండ రెవెన్యూ గ్రామాల రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ చౌదరి, డిప్యూటీ తహసీల్దారు సూర్యప్రతాప్, సీఎస్‌డీటి లక్ష్మీదేవి. మండల సర్వేయర్ ఆయేషా సిద్దిఖీ, స్థానిక సర్పంచు నాగమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...తరతరాలుగా సాగు చేస్తున్న భూములను వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే తొలగించారని మండిపడ్డారు. బ్యాంకు రుణాలను రెన్యూవల్ చేయలేదని, బ్యాంకు అధికారుల వేధింపులతో తీవ్ర అవస్థలు పడ్డామని అధికారుల ముందు తమ గోడు వినిపించారు. డిప్యూటీ తహసీల్దారు రైతులకు సర్ది చెప్పారు. బొమ్మనహాళ్‌లో జరిగిన సదస్సులో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు మల్లికార్జున, అనిల్, నాగరాజు సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, తహసీల్దార్ మునివేలు రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. బొమ్మనహాళ్ గ్రామ రెవెన్యూ పరిధిలో 22 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. గుమ్మఘట్ట మండలంలోని 75 వీరాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఏడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. నిబంధనలు మేరకు భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బెళుగుప్ప తహసీల్దార్ షర్మిల పేర్కొన్నారు. శ్రీరంగాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నగరూరులో సదస్సు నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 31దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం గ్రామంలో తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నందకిషోర్ పాల్గొన్నారు. గుత్తి మండలం పెద్దొడి గ్రామంలోని శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. భూసమస్యలు పరిష్కరానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని పెద్దొడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూసమస్యలపై రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ, పాల్గొన్నారు. రైతుల భూసమస్యకు చక్కటి పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులు అని రాయదుర్గం తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని వేపరాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరూ ప్రభుత్వ భూమిని కబ్జా చేయకూడదన్నారు. చిన్న చిన్న భూసమస్యలుంటే అప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మొత్తం 21 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి చెరువులో ఆక్రమణలను తొలగించాలంటూ సీపీఎం నాయకులు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవికి విన్నవించారు. నెలగొండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీపీఎం నాయకులు ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్, కసాపురం రమేశ్, వీరన్న పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్డీవో వసంతబాబు పేర్కొన్నారు. శెట్టూరు మండలం ములకలేడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఆర్ఐ, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని పలు గదులను పరిశీలించారు. ముఖ్యంగా కాంట్రాక్టర్‌ను పిలిపించి త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. రోగులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చొరవతీసుకోవాలని సీఎస్ఆర్ఎంఓ కృష్ణవేణి, సూపరిండెంట్ డేవిడ్‌కు సూచించారు. నీరు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు. అనంతరం పలువురు రోగులతో మాట్లాడి ఏయే సమస్యలపైన ఇక్కడికి వస్తున్నారని ఆరాతీశారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉందని వారు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రోగులకు సరైన సమాధానం చెబుతూ వారికి మందులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ప్రతిరోగికి ఇక్కడే చికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రతిది రెఫర్ అని రాస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిస్థితి చేయిదాటితేనే రెఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణీలకు, రోగులకు మధ్యాహ్నభోజనాన్ని నిర్వాహకులు అరవిందనారాయణరెడ్డి ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీచేశారు.

అదానీని వెంటనే అరెస్టు చేయాలి : సీపీఐ



అదానీ బొమ్మకు సంకెళ్లు వేసి నిరసన

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అదానీని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసనల్లో భాగంగా పట్టణంలోని టీ కూడలిలో అదానీ దిష్టిబొమ్మ ఆకారంలో మనిషికి రెండు సంకెళ్లను వేస్తూ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ లక్షల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. అదానీ దేశ పరువును మంట కలిపేవిధంగా వ్యవహరించారని, ఆయన అవినీతిపై అమెరికాలో కూడా ఎఫ్ఐఆర్ నమోదు కావడం సిగ్గుచేటన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రూ. 1750 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారిందని సీపీఐ నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అదాని కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుల్తాన్, చక్రధర్, గంగాధర్, చిన్నరాయుడు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

స్టోర్ నిర్వహణపై తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

పెద్దవడుగూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామంలోని చౌకధరల దుకాణం నిర్వహణపై టీడీపీ నాయకులు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రామన్న అనే వ్యక్తిపై దాదాతోపాటు కొంతమంది దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో స్టోర్ నిర్వహణపై తాను చెప్పిన వ్యక్తికే పంపిణీ చేయాలి అంటూ ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో దాదా అనే వ్యక్తి రామన్నపై కర్రతో తలపై దాడిచేయడంతో రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

యాడికి కాలువకు నీటిని కేటాయించాలి

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు ప్రత్యేక నీటి కేటాయింపు చేయాలని సీపీఐ తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య తెలిపారు. యాడికి కాలువకు నీటి కేటాయింపుపై మంగళవారం యాడికిలో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి కాలువ పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు సమీపం నుంచి ప్రారంభమై యాడికి మండలవ్యాప్తంగా విస్తరించిఉందని తెలిపారు. యాడికి మం డలం తరచు కరువుకు గురవుతున్నదని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో గతేడాది, ఈ ఏడా ది కూడా యాడికి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని తెలిపారు. రైతులు సాగుచేసిన ఏ ఒక్క పంట కూడా పూర్తిస్థాయిలో చేతికి అందేటట్లు లేదని తెలిపారు. ఈ నేపథ్యం లో మండల రైతాంగం పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలో సా గునీటికి ప్రధాన వనరు అయిన యాడికి కాలువకు నీటి ప్రత్యేక కేటాయింపులు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు వెంకటరాముడుయాదవ్, జూటూరు రఫీ, వడ్డె రాముడు, శ్రీరాములు, ఓబులరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక బయటకు తరలించకూడదు : ఎమ్మెల్యే

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'నిర్మాణ పనుల కోసం ఇసుకకు అనుమతిస్తా... కానీ ఒక్క ట్రిప్పు ఇసుక కూడా బయటకు పోకూడదు.. దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారో ముందుకు రండి' అని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాడికిలో ఆయన పర్యటించారు. చెన్నకేశవస్వామి ఆలయం వద్ద స్థానికులు, టీడీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇసుక దొరకక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు బేల్దార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల కోసం ఇసుకకు అనుమతిస్తా.... కానీ ఒక్క ట్రిప్పు ఇసుక కూడా బయటకు పోకూడదు అని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రుద్రమనాయుడు, వేలూరు రంగయ్య, చరణ్, నాగమునిరెడ్డి, త్రినాథ్‌రెడ్డి, దేవేంద్ర, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా చెన్నమల్లప్పస్వామి జాతర

బ్రహ్మసముద్రం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగేపల్లిలో చెన్నమల్లప్ప స్వామి జాతర మంగళవారం కన్నుల పండువగా జరిగింది. సోమవారం విశేష పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటల సమయంలో మఠాధిపతి చెన్నమల్లప్పస్వామి అశ్వరథంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ స్వామి తమ పూర్వీకుల సజీవ సమాధులను దర్శించుకుని హారతులను జరిపారు.

కల్తీకల్లును అడ్డుకున్న గ్రామస్థులు

కుందుర్పి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిజవళ్లి గ్రామంలో మంగళవారం కల్లు వాహనాన్ని అడ్డుకొని వందల లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. కల్తీకల్లు జనాన్ని కాటేస్తుందని గ్రామస్థులు మండిపడ్డారు. ఉత్పత్తి తక్కువగా వుండటంతో డిపో నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి రసాయనాలతో కల్తీ కల్లు చేసి మనుషుల ప్రాణాలతో ఆడుకుంటున్నారని అన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కల్తీ కల్లును ఆపాలని వాగ్వాదానికి దిగారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పారు.

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ

గుత్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్రీపురం, కొత్తపేట గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ సలీమ్ బాషా పరిశీలించారు. ఉ పాధి హామీ పథకం కింద చేపట్టిన పశువు ల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామం లో రూ. 21.30 లక్షలతో సీసీ రోడ్లు, రూ.6.90 లక్షలతో పశువుల షెడ్లు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఏపీడీ జి.విజయకుమార్, ఏపీఓ మద్దిలేటి, ఈసీ ఈశ్వరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సాయి సుభాష్‌కు ఐదు పతకాలు



గుత్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్ ఎంబీఏ కళాశాల విద్యార్థి సాయి సుభాష్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో ఐదు మెడల్స్‌ను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్‌రెడ్డి, సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎస్కేయూలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఐదు మెడల్స్ సాధించారు. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని త్రివేణి క్రీడల్లో జవిలిస్ బ్రోంజ్ మెడల్ సాధించిందని తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథం ఊరేగింపు, పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

గుమ్మఘట్ట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగచేడు గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి పరిసర గ్రామాల ప్రజలు హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామునే ప్రత్యేక అభిషేకం నిర్వహించి స్వామివారి పూల రథోత్సవం ఉదయం సాయంత్రం తిరిగి గుడికి చేర్చారు.

ఉరవకొండ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ పట్టణాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం పేర్కొన్నారు. పట్టణంలోని హమాలీ కాలనీలో రూ.5 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన సీసీ రోడ్లు నిర్మాణ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. పట్టణంలో రూ.1.90 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, కేశవానంద, బాబు ,బాలాజీ, లాల్‌స్వామి, ప్రభాకర్, నిమ్మల ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

సన్‌షేడ్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్లూరు రోడ్డులో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డికి చెందిన ఇంటి నిర్మాణంలో సన్‌షేడ్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. తాను మున్సిపల్ అనుమతి తీసుకున్నానని ఆయన తెలిపారు. తాము ఇచ్చిన ప్లాన్‌కు కట్టే ప్లాన్‌కు తేడా ఉందని అధికారులు వివరించారు. రోడ్డును ఆక్రమించారని, అందుకే తొలగిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నోటీసు ఇచ్చామని అధికారులకు తెలిపారు. నోటీసు ఇవ్వలేదని ఆయన వారితో వాగ్వాదానికి దిగారు.

కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వాలి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కార్మికులు విధులు బహిష్కరించి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రెండు గంటల పాట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులకు రావాల్సిన రెండునెలల వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే కార్మికులకు బకాయిలు పడ్డ రెండు నెలల వేతనాలు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, తిప్పేస్వామి, ఆదిలక్ష్మి, మల్లేష్, తిప్పేరుద్ర పాల్గొన్నారు.

ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసం

కూడేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాత్రి పూట తోటల్లో రైతులు లేని సమయంలో దొంగలు ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేస్తూ అందులో ఉన్న విలువైన కాపర్ వైరును చోరీ చేస్తున్నారు. సోమవారం రాత్రి సమయంలో పి. నాగిరెడ్డిపల్లికి చెందిన వరలక్ష్మి తోటలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. వరస దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు పోలీసులకు సవాల్‌గా మారారు. ఈ ముఠా ఆట ఎప్పుడు కట్టిస్తారో వేచిచూడాల్సిందే.